క్లుప్తంగా

గోవిందరావుకు రెడ్‌క్రాస్ సత్కారం



నైర అసిస్టెంట్ ప్రొఫెసర్ గోవిందరావును సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన రెడ్‌క్రాస్ వార్షిక సర్వసభ్య సమావేశం సందర్భంగా నైర వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.గోవిందరావును ఘనంగా సత్కరించారు. కళాశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినందుకు మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం



ఎస్పీ మహేశ్వరరెడ్డికి ప్రశంసాపత్రం అందిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎస్పీ మహేశ్వరరెడ్డి అన్నారు. యోగాంధ్రా విజయోత్సవాలలో భాగంగా శుక్రవారం శ్రీకాకుళంలోని ఎస్పీ కార్యాలయంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రశంసాపత్రాన్ని జోన్ చైర్మన్ లయన్ పొన్నాడ రవి కుమార్, నూతన అధ్యక్షురాలు లయన్ డాక్టర్ పైడి సింధూరలు ఎస్పీకి అందించి మాట్లాడారు. యోగాంధ్ర విజయోత్సవాలలో పోలీసుల సహాయ, సహకారాలు మరువలేనివన్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ యోగాంధ్ర విజయంలో భాగం కావడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యంగా జిల్లా అధికార బృందం, ఆయుష్ విభాగం, యోగా గురువులు, సాధకులు, ప్రజలు అందించిన సహకారం మరువలేనిదన్నారు. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ప్రతీ ఒక్కరినీ గుర్తించి ప్రతీ కార్యక్రమానికి సహకారం అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి టిక్కం రామ్‌గోపాల్, ఉపాధ్యక్షులు ఉర్లం శివతేజ తదితరులు పాల్గొన్నారు.

యోగా గురువుకు సన్మానం



మోహనరావును సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో నమోదైన యోగాంధ్ర కార్యక్రమంలో భాగస్వామ్యమైన యోగా గురువు ఐ.మోహనరావును శుక్రవారం జెడ్పీ సమావేశ మందిరంలో సత్కరించారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ సౌజన్యంతో జరిగిన ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో విశ్రాంత జేసీ రజనీకాంతరావు, జిల్లా ఆయుష్‌శాఖ అధికారి పి.జగదీష్, లయన్స్‌క్లబ్ జిల్లా అధ్యక్షురాలు పైడి సింధూర తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లి ఇలా.. సాగునీరు ఎలా?

- పిచ్చిమొక్కలు, తుప్పలతో నిండిన తోటపల్లి కాలువలు
- పూర్తికాని పిల్ల కాలువల నిర్మాణాలు
- ఎచ్చెర్ల నియోజకవర్గంలో శివారు గ్రామాలకు సాగునీరు అనుమానమే..



బుంటుపల్లి జగనన్న కాలనీ ఎదురుగా పిచ్చిమొక్కలతో నిండిన తోటపల్లి కాలువ



వెంకటరావుపేట సమీపంలో తోటపల్లి కాలువ దుస్థితి

నమ్మండి.. ఇది కాలువేనండి!

ఈ చిత్రంలో ఉన్నది ఏ మారుమూల అటవీ ప్రాంతమో కాదు. ఇది ఎచ్చెర్ల నియోజకవర్గంలోని వెంకటరావుపేట పరిసర గ్రామాల పరిధిలో పంట భూములకు సాగునీరు అందించే తోటపల్లి కాలువ. పూర్తిగా పిచ్చిమొక్కలు, తుప్పలతో నిండిపోయింది. ఖరీఫ్ సీజన్ ముంచుకొచ్చినా ఇంతవరకు పనులు చేపట్టలేదు. దీంతో ఈ ఏడాది కూడా సాగునీరు అందేది అనుమానమేనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రణస్థలం: రైతులకు ఏటా సాగునీటి కష్టాలు తప్పడం లేదు. తాము అధికారంలోకి వస్తే కాలువలు బాగు చేయించి శివారు భూములకూ సాగునీరు అందిస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి నాయకులు తర్వాత చేతులెత్తేశారు. దీంతో ఈ ఏడాది ఖరీఫ్‌కు సాగునీరు ప్రశ్నార్థకంగానే మారింది. ముఖ్యంగా తోటపల్లి కాలువ పిచ్చిమొక్కలతో నిండిపోవడంతో ఎచ్చెర్ల నియోజకవర్గంలోని భూములకు సాగునీరు అందే సూచనలు కనిపించడం లేదు. రణస్థలం, లావేరు, జి.సిగడాం మండలాల్లోని తోటపల్లి కాలువ ప్రధాన కాలువ పరిధిలోని పిల్ల కాలువలు పూర్తిగా పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. అరకొర నిధులు కేటాయించడం వల్ల ప్రధాన కాలువలో సైతం పూర్తి స్థాయిలో పూడికతీత పనులు జరగలేదు. పిల్ల కాలువ భూసేకరణ కూడా పూర్తి స్థాయిలో జరగకపోవడం శివారు గ్రామ రైతులకు సాగునీరు వెళ్లడం ప్రశ్నార్థకంగా మారిపోయింది. రణస్థలం మండలంలోని 211590 హెక్టార్లు, లావేరులో 11,008 హెక్టార్లు, జి.సిగడాంలో 6,373 హెక్టార్లు ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించేలా కాలువలు రూపొందించారు. అయితే కాలువల్లో గుర్రపు డెక్క, పిచ్చి మొక్కలు పేరుకుపోవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కోష్ట కూడలిలో తోటపల్లి కాలువ ఇలా..

గత ఏడాదీ అంతే..

గతేడాది సాగునీరు సకాలంలో అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దేవరాపల్లి, వెల్పురాయి, కమ్మసిగడాం, బంటుపల్లి వరకు మాత్రమే సాగునీరు అరకొరగా వచ్చి ఆగిపోయింది.

శివారుకు సాగునీరు ఎప్పుడు?

తోటపల్లి కాలువలో ఎక్కడికక్కడే పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. పూర్తి స్థాయిలో పిల్ల కాలువ పనులు జరగలేదు. ఈ ఖరీఫ్ సీజన్‌కు కూడా దేరసాం, పాతర్లపల్లి, పైడిభీమవరం గ్రామాలకు సాగునీరు అందే సూచనలు కనిపించడం లేదు.

– మీసాల రామారావు, దేరసాం సర్పంచ్

వర్షాలు సక్రమంగా లేకపోవడంతో వరి పొలాలు ఎక్కడికక్కడే ఎండిపోయాయి. దేరసాం, కోష్ట, తెప్పలవలస, తామాడ వైపు పిల్ల కాలువలు పూర్తి కాకపోవడంతో రైతుల పాట్లు వర్ణనాతీతం. ఈ ఏడాది శ్రీకాకుళం బ్రాంచి కాలువకు రూ.19 లక్షల నిధులు మాత్రమే కేటాయించడంతో పూడికతీత పనులు అంతంతమాత్రంగానే జరిగాయి.

హామీలు నీటిమూటలేనా?

కూటమి ప్రభుత్వం ఆధికారంలోని వచ్చాక తోటపల్లి కాలువ ద్వారా శివారు గ్రామాలకు సాగునీరు అందించడమే తమ ధ్యేయమని నాయకులు చెప్పిన హామీలన్నీ బూటకమేనని తేలిపోతున్నాయి. రణస్థలం మండలంలోని దేరసాం, పైడిభీమవరం, తెప్పలవలస, లావేరు మండలంలోని గురుగుబిల్లి, తామాడ, బెజ్జిపురం వంటి గ్రామాలకు పిల్ల కాలువలు తవ్వాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చి రెండో ఖరీఫ్ సీజన్ సమీపించినా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో పూడిక తీత పనులు, పిల్ల కాలువల నిర్మాణం చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

మరో వారం రోజుల్లో..

తోటపల్లి కాలువ పూడికతీత పనులు చేపట్టాం. నిధులు తక్కువగా రావడం వల్ల ప్రధాన శ్రీకాకుళం బ్రాంచ్ కాలువ పనులు మాత్రమే చేయగలిగాం. పిల్ల కాలువలు ఉపాధి హామీ పనులు ద్వారా చేయమని చెప్పాం. అక్కడక్కడా జరిగాయి. ఇంకా కొంతమేర ఉండిపోయింది. మరో వారం రోజుల్లో కాలువ నీరు వస్తుంది. – కె.లావణ్య ప్రియదర్శిని, డీఈఈ, తోటపల్లి ప్రాజెక్టు

58 రకాల వంటకాలతో నైవేద్యం



పాత శ్రీకాకుళంలోని సంతోషిమాత దేవాలయంలో ఆషాఢ శుద్ధ తదియ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి 58 రకాల పిండివంటలతో నైవేద్యం సమర్పించారు. అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి సుప్రభాత సేవ, మహన్యాస పూర్వక నమక చమక సహిత పంచ సూక్తాలతో క్షీరాభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. – శ్రీకాకుళం కల్చరల్

చంద్రబాబువి మోసపూరిత హామీలు



రావాడ పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

- మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ధ్వజం

రణస్థలం: కూటమి ప్రభుత్వం మోసపూరిత హామీలను ప్రజలకు ప్రతిరోజూ గుర్తు చేయాల్సిన ఆవశ్యకత ఉందని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. రణస్థలం మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో 'కార్యకర్తలే కీలకం' సమావేశాన్ని రావాడ గ్రామ నాయకులతో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా బాబు ష్యూరిటీ ... మోసం గ్యారెంటీ పేరుతో రీ కాలింగ్ 'చంద్రబాబుస్ మేనిఫెస్టో' కార్యక్రమాన్ని గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. చంద్రబాబు మ్యానిఫెస్టోను గుర్తు చేస్తూ జిల్లా, మండల, గ్రామ, రచ్చబండ వంటి కార్యక్రమాలను విడతల వారీగా ఏర్పాటు చేసి క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి వీడియోల రూపంలో అర్థమయ్యేలా ప్రజలకు వివరించాలన్నారు. గ్రామ కమిటీలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎటువంటి సమస్య వచ్చిన నేరుగా తనను సంప్రదించాలని, పరిష్కారం చేసే దిశగా అడుగులు వేస్తామన్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు, ఎంపీటీసీ ప్రతినిధి కిల్లారి సూర్యనారాయణ, మాజీ ఎఫ్ఎస్‌సీఎస్ అధ్యక్షుడు కిల్లారి రమణ, నాయకులు లంక పాపారావు, బూర సత్యం, బొంతు సూరి, కిల్లారి అప్పలనాయుడు, లంక అసిరినాయుడు, రాము, రమణ, గొర్లె రమణ, అప్పలరాము తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్‌సేఫ్టీ అధికారికి సన్మానం



వెంకటరత్నంను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

శ్రీకాకుళం: జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారిగా పనిచేసి బదిలీపై ఏలూరు వెళుతున్న వెంకటరత్నంకు హోటల్ అసోసియేషన్, కిరాణా వర్తక సంఘం, బ్యాకరీ అండ్ స్వీట్స్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హోటల్ అసోసియేషన్ ప్రతినిధులు మెట్ట నాగరాజు, వరద ఆనందకుమార్, బస్వా శ్రీనివాస్‌రెడ్డిలు మాట్లాడుతూ వెంకటరత్నం అందించిన సేవలను కొనియాడారు. అనంతరం వెంకటరత్నం ఎవరినైనా బాధపెడితే, అది ఉద్యోగ ధర్మం, ప్రజల ఆరోగ్య పరిరక్షణకే తప్ప వ్యక్తిగతం కాదని చెప్పారు. కార్యక్రమంలో జామి రాజా, కెల్ల చిన్ని, మాధవి, భాను, శ్రీను, వినోద్, ఎస్ఎస్ఆర్ శ్రీను, కోరాడ హరిగోపాల్, కోరాడ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

జయ జయ వారాహి..!



బలగ కాలభైరవ ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు



పాండ్రంగి వీధి లలితాపీఠంలో వారాహి అమ్మవారికి వెండి కవచ అలంకరణ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాండ్రంగి వీధిలో లలితాదేవి పీఠంలో వారాహి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారికి శుక్రవారం కుంకుమ పూజలు నిర్వహించారు. పీఠం నిర్వాహకులు వేదుల సూర్యనారాయణశర్మ అమ్మవారిని వారాహీ దేవిగా అలంకరించి పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం వెండి ఆభరణ కవచంతో అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు లలితా సహస్రనామ పారాయణ చేశారు.

- బలగ నాగావళి తీరంలో ఉన్న బాలా త్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చనలు, హోమాలు, యంత్ర పూజలు, ద్వాదశ హారతులు జరిగాయి.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

రణస్థలం: రణస్థలం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పైడిపల్లి అప్పలనరసయ్య (పండు) కుమార్తెకి శస్త్రచికిత్స జరగడంతో మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శుక్రవారం పరామర్శించారు. మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మజ్జి రమేష్, ఉప సర్పంచ్ కెల్ల ఆదినారాయణ, బొంతు సూరి, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మినగర్‌లో అంధకారం

అరసవల్లి: నగర పాలక సంస్థ పరిధిలోని మహాలక్ష్మి నగర్ కాలనీ ప్రాంతంలో ప్రధాన రహదారిలో వీధి లైట్లు నెలరోజులుగా వెలగడం లేదు. దీనిపై స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. వీధిలైట్లు లేకపోవడంతో దొంగల భయం పొంచి ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతు పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మొక్కజొన్న సాగులో..

సస్యరక్షణ చర్యలు తప్పనిసరి

- కత్తెర పురుగుపై అప్రమత్తత అవసరం
- రైతులకు సూచనలిస్తున్న అధికారులు



మొక్కజొన్న సాగు



కత్తెర పురుగు నివారణకు మందులను పిచికారీ చేస్తున్న రైతు

జి.సిగడాం: జిల్లాలో మొక్కజొన్న సాగు విస్తీర్ణం ఏటా పెరుగుతోంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సుమారు 18 వేల హెక్టార్లలో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఈ పంట సాగులో జిల్లాలోనే జి.సిగడాం మండలం ప్రథమ స్థానంలో ఉంది. ఇక్కడ ఎకరాకు సుమారు 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. ముఖ్యంగా మెట్టు ప్రాంతాల్లో మొక్కజొన్న సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో పంటను తెగుళ్ల సమస్య సైతం వెంటాడుతోంది. కత్తెర పురుగు నివారణపై రైతులకు సంబంధిత అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి రైతు వారానికి రెండుసార్లు పంటను గమనిస్తూ కత్తెర పురుగును గుర్తిస్తే వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు.

సస్యరక్షణ చర్యలివే...

ఖరీఫ్‌లో మొక్కజొన్న పంటలో కాండం తొలిచే కత్తెర పురుగు రెండు మూడు వరసల్లో ఆకు మొదలు కాండం మధ్య గుడ్లు పెడుతుంది. నాలుగైదు రోజుల్లో ఎదిగి పిల్ల పురుగుల్లా మారుతాయి. మొదటి దశమొవ్వను రంధ్రం చేసి అంకురాన్ని చేరడం వల్ల పొడగాటి రంధ్రాలు ఏర్పాడతాయి. లార్వాలు ఎదిగే అంకురాన్ని తినడం వల్ల మొవ్వ నాశనమై మొక్క చనిపోతుంది. కత్తెర పురుగు నివారణకు మొదటి వారం పది రోజుల వ్యవధిలో క్వినాలఫాస్ 400 మిల్లీలీటర్ల మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. 20 –25 రోజుల తర్వాత హీమోమెత్తిన్ బెనెంజేటి మందు 80 గ్రాములను పిచికారీ చేయాలి. కొందరు మెట్టు పొలంలో దున్నకపోవడంతో కలుపు ఎక్కువగా వస్తోంది. దీని నివారణకు కిలో అట్రాజిన్ 50 శాతం పొడి మందును 200 లీటర్ల నీటిలో పిచికారి చేయాలి.

అవగాహన కల్పిస్తున్నాం



మొక్కజొన్న సాగులో రైతులను పీడిస్తున్న తెగుళ్లపై ముఖ్యంగా కాండం పురుగు నివారణపై రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. రైతు సేవా కేంద్రం సిబ్బంది ద్వారా కూడా సలహాలు, సూచనలు అందిస్తున్నాం.

– బెండి బాబ్జీ, వ్యవసాయాధికారి, జి.సిగడాం

జనం చెంతకు జగన్నాథుడు



స్వామివారిని నమస్కరిస్తున్న చిన్నారి



బొందిలీపురంలో స్వామివారిని రథంపైకి తీసుకొస్తున్న అర్చకులు, భక్తులు



గుజరాతిపేటలో రథంపై జగన్నాథుడు



గుజరాతిపేటలో ఊరేగుతున్న జగన్నాథుడు



కోదండ రామాలయంలో పూజలందుకుంటున్న స్వామివారు



మొండేటివీధిలో వేంచేసిన జగన్నాథ స్వామి



కోష్ట రాధాగోవింధ మందిరంలో జగన్నాథ, సుభద్ర, బలరామ విగ్రహమూర్తులు



మురపాకలో పూజలందుకుంటున్న స్వామివారు



రాధాకృష్ణ గోశాల మందిరంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలోని జగన్నాథ స్వామి ఆలయాలలో శుక్రవారం ఆషాఢ శుద్ధ విదియ పురస్కరించుకొని జగన్నాథుని రథయాత్ర నేత్రపర్వంగా నిర్వహించారు. అశేష భక్తజనం కోలాహలం మధ్య ఊరేగింపు కొనసాగించారు. ముందుగా రథాన్ని పూలు, మామిడి తోరణాలతో అందంగా అలంకరించారు. అనంతరం సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామిని రథంపై ఉంచి పురవీధులలో ఊరేగించారు. భక్తులు రథాన్ని లాగుతుండగా మధ్య మధ్యలో భక్తుల ఇంటి ముందు నిలిపి పూజలు నిర్వహించారు. శనివారం నుంచి స్వామి ఒక్కొక్క అవతారంలో భక్తులకు దర్శనమిస్తుంటారు.

- గుజరాతిపేటలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జగన్నాథస్వామి ఆలయంలో పెంటవంశీయులు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. జగన్నాథుడు, సుభద్ర, బలభద్రుల మూలవిరాట్టులను రథంపై ఉంచి యాత్ర కొనసాగించారు. సమీపంలోని గుడిసెనగుళ్ల వద్దకు తీసుకెళ్లి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ శ్యామలరావు, భక్తులు పాల్గొన్నారు.
- బొందిలీపురంలోని సదావర్తి పులహోరీ తఖియా మఠంలో సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథ స్వామి ఉత్సవమూర్తులకు పూరీ సంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహించారు. మఠం నిర్వాహకులు లక్ష్మీధర్ దాస్ బాబాజీ పర్యవేక్షణలో ఉత్సవ మూర్తులను రథంపై ఉంచి పురవీధులలో ఊరేగించారు. భక్తులు రథాన్ని లాగుతూ ఇల్లిసుపురం కూడలి వద్ద గుడించా మందిరం వద్దకు చేర్చారు.
- పాండ్రంగి వీధిలోని రామమందిరంలో జగన్నాథస్వామి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మొండేటివీధిలోని శివకామేశ్వరస్వామి దేవాలయంలో షిరిడీసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో జగన్నాథస్వామిని రథంపై ఉంచి ఊరేగించారు.
- ఎచ్చెర్ల: లావేరు మండం మురపాకలో జగన్నాథ స్వామి ఆలయంలో రథయాత్ర సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.
- శ్రీకాకుళం కల్చరల్: జగన్నాథ స్వామి రథయాత్ర సందర్భంగా పాలకొండ రోడ్డులోని కోదండ రామాలయంలో అర్చకుడు బంకుపల్లి శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- రణస్థలం: రథయాత్ర సందర్భంగా కోష్ట సమీపంలోని రాధాగోవింద మందిరం, రాధాకృష్ణ గోశాల ఆలయాలకు భక్తులు పోటెత్తారు. జగన్నాథుడు, సుభద్ర, బలరామ విగ్రహమూర్తులకు ప్రత్యేక అలంకరణ చేశారు.

ఐటీ రిటర్న్స్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఐటీఓ చంద్రశేఖర్‌ప్రదాన్

పొందూరు: ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆదాయపు పన్ను రిటర్న్స్ ఫైలింగ్‌పై, ట్రెజరీకి సమర్పించాల్సిన బిల్లులపై పొందూరు, జి.సిగడాం మండలాలకు చెందిన డీడీఓలతో ఐటీఓ చంద్రశేఖర్‌ప్రదాన్ ఆధ్వర్యంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. డీడీఓలకు శ్రీకాకుళం ఆదాయపు పన్ను అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 24–జి ప్రకారం ప్రతి నెలా 15వ తేదీలోగా ఆదాయపు పన్ను పరిధిలోకి వచ్చే అధికారుల రిటర్న్స్ ఫైలింగ్ చేయడంలో డిఫాల్టర్లు అయిన డీడీఓలకు 16వ తేదీ నుంచి రూ.200 నుంచి రూ. 500 వరకు అపరాధ రుసుం పడుతుందని అప్రమత్తం చేశారు. సీఎఫ్ఎంఎస్ పోర్టల్, నిధి పోర్టల్ లేటెస్ట్ ప్రావిజన్ మ్యాపింగ్, బిల్స్ సబ్మిట్ చేయడంలో పొరపాట్లను తెలియజేశారు. జీవో 15, 12 ప్రకారం సమర్పించాల్సిన బిల్లులను సూచించిన తేదీల్లోనే సమర్పించాలని ట్రెజరీ అధికారులు సూచించారు. ఈ సమీక్షలో ఆదాయపు పన్ను అధికారులు ఐటీఓ చంద్రశేఖర్ ప్రధాన్, టీఏ ఎర్నిబాబు, ఎస్టీఓ ఎం.తులసీరావు, డీఎల్ఓ శ్రీనివాసరావు, ఎస్ఏ రమణమ్మ, జేఏ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.